# మాయరోగం

అదో చిన్న కాకా హోటల్. టీ, కాఫీ, సాల్ట్ బిస్కట్లు, అప్పుడప్పుడు సమోసాలు, ఎప్పుడూ సిగిరెట్, బీడీ, అగ్గిపెట్టెలు తప్ప అక్కడ ఇంకేమీ దొరకవ్. ఒక్కో దానిమీద ఇద్దరయితే సుఖంగానూ, ముగ్గురయితే ముడుచుకుని కూర్చునేందుకు వీలుగానూ రెండు నాపరాళ్లను ఏర్పాటు చేశారు. ఉదయాన్నే వచ్చే వార్తాపత్రిక సాయంత్రానికల్లా మసి పూసుకుని మాసిపోయి, ఒక్కోసారి తడిసి ముద్దయిపోయి, ఒక్కొక్కసారి చినిగి పీలికలైపోయి, దాని స్థితిని బట్టి గూట్లోకో, చెత్తబుట్టలోకో చేరిపోతుంటుంది. అయితే అక్కడ ఇంకొక్క ముఖ్యమైన విశేషం ఏమిటంటే టీ, కాఫీ ఉన్నంత వరకూ రేడియోలో ఏదోక ప్రోగ్రాం వస్తూనే వుంటుంది. భాషతో నిమిత్తం లేకుండా.

అదుగో ఆ కాకా హోటల్లో కాఫీ చప్పరిస్తూ మధ్య మధ్యలో సిగిరెట్ పొగ పీల్చి వదుల్తూ ఏదో ఆలోచనలో ఉన్న ఆంజనేయులు చెవిన రేడియోలో నించి వినపడసాగిందో తెలుగు సినిమా పాట.

'పులిని చూస్తే పులి ఎన్నడు బెదరదు/మేకని చూస్తే మేక ఎన్నడు అదరదు/మాయరోగమదేమో కాని మనిషి మనిషికి కుదరదు' అని అదుగో అప్పుడు ఆంజనేయులికి అనుమానం వచ్చింది.

మాయరోగం అంటే ఏమిటి? సరే ఏదో ఒకటి అనుకుందాంలే అనుకుంటే ఈ మాయరోగం మనుషులకేనా పశుపక్ష్యాదులకు, వృక్షాలకూ, జంతువులకు, క్రిమికీటకాలకక్కూడా వర్తిస్తుందా? పెద్ద సందేహంలో పడిన ఆంజనేయులుకు... ఆరోసెన్స్ మాత్రం మాయరోగం మనుషులకు మాత్రమే అని చెప్పసాగింది. అలా సందిగ్ధంలో ఉండగా...

"సార్... బాగున్నారా?" అడుగుతూనే ఆంజనేయులుకు దగ్గరగా వచ్చి నిల్చున్నాడు నడివయస్కుడు.

బాగున్నానన్నట్లు తలాడించిన ఆంజనేయులు "మీరెవరూ?" అనే సందేహాన్ని హావభావాల్తోనే ప్రకటించాడు.

"నన్ను గుర్తు పట్లేదా సార్" నవ్వుతూ అడిగేడతగాడు.

"సారీ ... గుర్తు రావటం లేదు."

"నన్ను గుర్తు పట్టకపోవటం అన్యాయం సార్" ఆంజనేయులు కళ్లల్లోకి చూస్తూ అన్నాడు.

బలవంతంగా ఓ నవ్వు నవ్వేడు గాని ఫలితం శూన్యం. ఆ వ్యక్తి ఎవరో గుర్తుకు రాలేదు ఆంజనేయులకు.

"సరే ఓ క్లూ ఇస్తాను కనుక్కోండి" చనువుగా అన్నాడతడు. 'వీడెవడో నాటకం ఆడుతున్నట్లు లేదు. మోసగాడనో, మాయగాడనో తొందరపడి అనుకుంటే, ఆనక అతడెవరో తెలుసుకున్నాక సిగ్గు పడిపోయి, క్షమాపణ అడగాల్సి వస్తుందేమో' మనసులోనే అనుకున్నాడు ఆంజనేయులు.

"చెప్పండి"

"నా పేరు సుబ్బారావ్" అన్నాడు చిరునవ్వు చెదరకుండా. తలపట్టుకున్నా, కొట్టుకున్నా బాగుండదని వూరుకున్నాడు గాని ఒళ్లు మండిపోయింది ఆంజనేయులకి.

"ఏదైనా పెక్యులియర్ పేరయితే, పేరు వినగానే ఠపీమని గుర్తొచ్చే అవకాశం వుంది గాని ఈ పేరు వింటే ఏం గుర్తొచ్చి ఛస్తుంది నా...' అనుకున్న ఆంజనేయులు ఎందుకయినా మంచిదని తనకి పరిచయం ఉన్న చాలామంది సుబ్బారావుల్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. గాని ఇతనెవరో మాత్రం గుర్తుపట్టలేకపోయాడు.

"సారీ అండి... ఏమనుకోవద్దు.. మీరెవరో చెప్పేసేయండి" తటపటాయిస్తూ అన్నాడు ఆంజనేయులు.

"లాస్ట్ ఛాన్స్... ఓ ఊరి పేరు చెప్తా.. ఈజీగా పట్టేస్తారు" ఉత్సాహంగా అన్నాడు సుబ్బారావ్.

మామూలుగా అయితే విసుగొచ్చేసేదే కాని అతగాడంత చనువుగా, ఉత్సాహంగా మాట్లాడుతుండేసరికి కాదన్లేకపోయాడు ఆంజనేయులు.

'మాయరోగం అంటే ఇదా!... కాదు కాదు దీన్ని మొహమాటం అంటారు కదూ' సర్దిచెప్పుకున్నాడు స్వగతంగా ఆంజనేయులు.

"తిరపతి" అని ఫెళ్లున నవ్వసాగేడు ఆ అపరిచిత వ్యక్తి. తిరపతిలో ఉన్న మేనత్త, బాబాయి కొడుకు, పదో తరగతిలో క్లాస్‌మేట్, ఇటీవలే బదిలీపై

వెళ్లిన తన క్లోలీగ్... ఈ నలుగురే స్ఫురణకు వచ్చారు ఆంజనేయులకు. అంతకు మించి ఆ ఊర్లో తనకి పరిచయం వున్న వాళ్ళెవ్వరూ వెంటనే గుర్తుకు రాలేదు. ఈ సుబ్బారావ్ అసలే గుర్తుకు రాలేదు.

అంతలో ఆ హోటల్ ముందు నుంచి మోపెడ్ మీద వెళ్తున్న వ్యక్తి.

"హలో సుబ్బారావ్.. వస్తావా... ఇంటి దగ్గర డ్రాప్ చేస్తా" అని అడగటంతో

"సరే గురువుగారు... రేపు సాయంత్రం ఈ టైము వరకూ బాగా ఆలోచించండి... అప్పటికీ నేను గుర్తు రాకపోతే నేనే చెప్పేస్తా. కాని చెప్పిన తర్వాత మీరే నాలిక్కరుచుకుంటారు. నొచ్చుకుంటారు. బహుశా రాత్రికి మీ ఇంట్లో వాళ్లతో నాపేరు, ఊరు చెప్పి చూడండి. వాళ్ల ద్వారానైనా మీకు గుర్తుకు వస్తానేమో... రేపు తప్పకుండా ఈ టైముకే ఇక్కడికి రండి.. నేనూ వస్తా" అని చెప్పి, ఆంజనేయులు ఏం చెప్పేందుకూ అవకాశం ఇవ్వకుండా వెళ్లిపోయాడు సుబ్బారావ్.

బుర్ర వేడెక్కిపోయేసరికి మరోసారి కాఫీ తాగేడు. సిగిరెట్ వెలిగించుకుని మెల్లగా ఇంటి దారి పట్టాడు. సుబ్బారావ్ ఎవరబ్బా అనే ఆలోచనతో మునిగిపోయిన ఆంజనేయులుకు హఠాత్తుగా 'మాయరోగం' గుర్తొచ్చింది మళ్లీ.

'అబ్బే దీన్ని మతిమరుపు రోగం అంటారు గాని, మాయరోగం ఇది కాదు' తనకు తానే సమాధానం చెప్పుకుని మళ్లీ 'హు ఈజ్ సుబ్బారావ్' దగ్గరకి వెళ్లిపోయాడు. నడుస్తు వెళ్తున్నాడే గాని మనసంతా సుబ్బారావ్ చుట్టూనే తిరుగుతున్నది.

ఇంటికి వెళ్లి భార్య దగ్గర ఈ ప్రస్తావన తీసుకువస్తే ఆమె చెప్పేయగలదనే నమ్మకం వుంది గాని ఎందుకో అప్పుడే ఆమెకు ఈ విషయం చెప్పడం ఇష్టం లేకపోయింది. సుబ్బారావ్ ఎవరన్నది తనకు తానే గుర్తు తెచ్చుకోవాలని పట్టుదల పెరిగిపోయింది ఆంజనేయులకు. ఆలోచనతోనే ఇల్లు చేరాడు.

ఇంట్లోకి అడుగు పెడుతుండగానే ముచ్చటగా ముస్తాబై ఎదురొచ్చిన భార్య కాత్యాయని "ఏమిటి మొహం అదోలా ఉంది?" అనడిగింది.

అసలు వీళ్లకి నిజంగానే ముఖంలో ఏదైనా తేడా కన్పించి అడుగుతారా? లేకపోతే 'ఓ రాయి అలా విసిరి చూద్దాం' అనుకుని అడుగుతారా? ఏది ఏమైనా ఈ భార్యలనబడే వారంతా ఇలాంటి విషయాల్లో

బహుదిట్టలు. నా ముఖంలో ఎలాంటి మార్పు కనిపిస్తున్నదో అడిగి తెలుసుకోవాలి' అనుకున్నాడు ఆంజనేయులు.

"అదోలా అంటే ఎలావుంది?" సాధ్యమైనంత వరకు ఏ భావం వ్యక్తం కాకుండా అడిగేడు.

"దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నట్లుంది".

ఆమె అంత కరెక్ట్‌గా చెప్పేసరికి ఖంగుతిన్నాడు ఆంజనేయులు. "నువ్వు మొన్నీమధ్య సొంత ఇల్లు కట్టుకుంటే బావుంటుందన్నావు చూడు, ఆ విషయం గురించి ఆలోచిస్తున్నాను."

"సర్లెండి... మీ కలాంటి ఆలోచన్లు పైగా ఇంత సీరియస్‌గా ఆలోచించే అలవాటుంటే ఎప్పుడో బాగుపడే వాళ్లం. పోనీలెండి అంత సీక్రెట్ విషయమయితే నాకేం చెప్పొద్దులే" విద్దూరంగా అనేసింది కాత్యాయని.

"అబద్ధం చెప్తే ఆడది చెప్పాలిగాని మగవాళ్లం... మనం ఎందుకు పనికి వస్తాం" ఆంజనేయులు మనసు చెప్పిందతన్తో.

పక్కింటి పాప రాకతో వాళ్ల సంభాషణకు అంతరాయం కలిగింది. మళ్లీ కాత్యాయని ఆ ప్రస్థావన తీసుకురాకపోవడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు ఆంజనేయులు. సుబ్బారావుని గుర్తుకు తెచ్చుకునేందుకు విఫలయత్నం చేస్తూనే స్నానం, భోజనం, టీవీ చూడ్డం వగైరాలు పూర్తి చేసి నిద్రలోకి జారుకున్నాడు. ఆలస్యంగా నిద్రపోవడంతో రోజుకన్నా ఆలస్యంగా లేచాడు. ఆఫీసుకు టైం కావడంతో హడావిడిగా తయారై, కాఫీ, టిఫెన్ను పూర్తిచేసుకుని, క్యారేజి చేత పుచ్చుకుని బయల్దేరేడు ఆఫీసుకు.

ఆఫీసు పనిలో నిమగ్నమయ్యాక సుబ్బారావుని గురించి ఆలోచించే తీరిక దొరకలేదు ఆంజనేయులుకు. పని వత్తిడి కారణంగా లంచ్ కూడా ఆలస్యంగా చేశాడు. పని ధ్యాసలో పడితే మిగిలిన ప్రపంచంతో పని వుండదతనికి. సాయంత్రానికి పని మొత్తం పూర్తిచేసుకుని ఖాళీ టిఫెన్ బాక్స్ చేత పుచ్చుకుని ఆఫీసు నుండి బయటపడ్డాడు.

'సుబ్బారావు వచ్చివుంటాడు. నాకు గుర్తుకు రాలేదు. నువ్వే చెప్పు' అని అతను కనపడగానే అడిగేయాలని నిర్ణయించుకుని కాకా హోటల్ వైపు ప్రయాణమయ్యాడు. అతని అంచనా నిజమయ్యింది. తను వెళ్లేసరికి హోటల్ దగ్గర నవ్వుతూ కన్పించాడు సుబ్బారావ్.

"నే ఓడిపోయాను. ఇక టెన్షన్ ఫీలవ్వలేను. నువ్వెవరో వెంటనే చెప్పేయవోయ్" అన్నాడు ఆంజనేయులు.

అతడు చెప్పేడు. ఆంజనేయులు అతను మాట్లాడటం మొదలు పెట్టంగానే మొత్తం గుర్తొచ్చేసి అమాంతంగా సుబ్బారావును కౌగలించుకున్నాడు.

"అయామ్ సో సారీ... మిమ్మల్ని గుర్తు పట్టలేకపోవడం క్షమించరాని నేరం. నన్ను క్షమించండి ప్లీజ్..." సుబ్బారావు చేతులు పట్టుకుని ప్రాధేయపడ్డాడు ఆంజనేయులు.

"మా ఇంటికి రండి.. మా ఆవిడ కూడా చాలా సంతోషిస్తుంది. నాకూ తృప్తిగా వుంటుంది. ఈ పూట మా ఇంట్లో భోజనం చేసి వెళ్దురుగాని" మర్యాదగా అన్నాడు.

తను ఊరు వెళ్ళేందుకు బయల్దేరినట్లూ ఇంకోసారి వచ్చినప్పుడు తప్పకుండా వస్తానని మాటిచ్చాడు సుబ్బారావు. ఇద్దరు కలిసి కాఫీ తాగేరు ముచ్చట్లాడుకుంటూ, తను గుర్తు పట్టలేకపోయినందుకు పదేపదే నొచ్చుకుంటూ, మళ్లీ మళ్లీ క్షమించమని ప్రాధేయపడ్డాడు ఆంజనేయులు.

"ఇలాంటివన్నీ మామూలే. మీరేం వర్రీ అవకండి" అని శెలవు తీసుకువెళ్లిపోయాడు సుబ్బారావ్. క్రితం రోజు నుంచి మనసులో వున్న సందిగ్ధం తీరిపోయిన ఆంజనేయులు ఇప్పుడు సగం ఆనందంగా వున్నాడు. సుబ్బారావ్‌ని గుర్తుపట్టలేకపోయినందుకు విచారంగానూ ఉన్నాడు. త్వరగా ఇంటికి వెళ్లి భార్యకు సుబ్బారావ్ సంగతి చెప్పి కాస్తంత ఉపశమనం పొందాలనుకుని ఇంటికి బయల్దేరేడు ఆంజనేయులు. అతడలా బయల్దేరిన అయిదు నిమిషాల్లోనే కన్పించాడు అతగాడు. దాదాపు ఏడెనిమిది సంవత్సరాల క్రితం చూసిన ముఖం. ఆ ముఖాన్ని చూడగానే ఆంజనేయులు ముఖంలో రంగులుమారినై, కోపం, ఆవేశం, అసహనం... అప్రయత్నంగా పిడికిళ్లు బిగుసుకున్నాయ్. పళ్లు పటపటమన్నాయ్. దవడ ఎముక వేగంగా ఆడసాగింది. అప్పుడెప్పుడో బస్సులో అతన్తో ఓ చిన్న గొడవ పడ్డాడు ఆంజనేయులు. మాటమాట అనుకున్నారు. ఆవేశంలో అతగాడు ఆంజనేయులు చొక్కా కూడా పుచ్చుకున్నాడు. తను చేయి ఎత్తబోతుండగా తోటి ప్రయాణీకులు అడ్డుకున్నారు. తర్వాత అతన్ని చూడ్డం ఇదే, అయినా ఇప్పుడు అతను ఆంజనేయుల్ని చూడలేదు. తనదారిన తాను వెళ్లిపోయాడు. ఆంజనేయులు కాసేపటి వరకూ మామూలు మనిషి కాలేకపోయాడు. యాంత్రికంగా ఇల్లు చేరేడు.

"ఏమిటి అంత కోపంగా వున్నారు" అడిగింది కాత్యాయని. షాక్ తిన్నాడు ఆంజనేయులు. 'భార్యంటే ఇలా వుండాలి' అనుకున్నాడు.

సుబ్బారావ్ సంగతంతా వివరంగా చెప్పేడు. 'అమ్మో ఆయన్ని బలవంతం చేసి ఇంటికి తీసుకురావలసింది' అని నొచ్చుకుంది కాత్యాయని. కాసేపు ఇద్దరూ సుబ్బారావ్ తమను ఆ రోజున ఆపద్బాంధవుడిలా ఆదుకున్న వైనం ఓసారి మననం చేసుకున్నారు.

భర్తకి కాఫీ తెచ్చేందుకు లోపలికెళ్ళిందామె.

ఆ క్షణంలో జ్ఞానోదయం అయింది ఆంజనేయులకి. మాయరోగం అంటే మనకి సహాయం చేసిన వాళ్లని సులభంగా మరచిపోవటం, ఏ కొంచెం మాటామాటా అనుకున్నా, వాళ్ల రూపురేఖల్ని ఎంతకాలమైనా మర్చిపోలేకపోవటం అని అర్థమైపోయింది ఆంజనేయులుకి. అంతేకాదు ఈ మాయరోగం మనుషులకు తప్ప వేరే ప్రాణులకు వుండదని కూడా ఓ అభిప్రాయం ఏర్పరచుకున్నాడు ఆంజనేయులు.

◆ ఆంధ్రప్రభ - **25 మే, 2003** ◆